ఈ వారం కథ

బలి

పాటిబండ్ల రజని

"అమ్మగారూ, టీలు కావాలటండీ" అన్న పిలుపుకి చుట్టింటి గుంజనానుకుని కునుకుతీస్తున్న కస్తూరి ఉలిక్కిపడి కళ్ళుతెరిచింది.

"అర్ధరాత్రపుడు టీ అంటే ఎలా కిట్టప్పా? చద్దన్నాల్లోకి పెరుగు తోడుకోదని పాలు త్వరగా తోడుపెట్టేశాను. మజ్జిగ కలిపిస్తా పట్టుకెళ్ళు" విసుగు నణచుకుంటూ అని, నిమ్మకాయల బుట్టందుకుని కోయడం మొదలుపెట్టింది.

"అప్పుడే ఇసుగొత్తే ఎట్టాగమ్మా! అసలు ఎలచ్చను పనంతా ముందుంది" హుషారుగా అన్నాడు కిట్టప్ప. ఎలక్షన్ పేరుతో పనిలేకుండా తిరగొచ్చనీ, టీలూ, టిఫెన్లు మస్తుగా తినచ్చని మంచి సరదాగా వుంది కిట్టప్పకి!

"ఇంతకీ ఇంత పొద్దుపోయిందాకా నడిచే మంత్రాంగాలేమిటంటా? అయ్యగారు స్నానమైనా చెయ్యలేదు! నీళ్ళు చల్లారినా, వంట చల్లారినా మళ్ళీ అదో గొడవ! ఆ పొంతకుండ కింద నిప్పులోసారి ఊదు" అని నిమ్మరసం వడపోసి ఉప్పూ మజ్జిగా కలపసాగింది కస్తూరి.

"మంతరాంగమంటే చానా వుందమ్మా! మనూరి పెసిరెంటుకి ఈసారి ఆడోళ్ళనే నిలబెట్టాలని వచ్చిందంట. మొగోళ్ళసలు పోటీచెయ్యకూడదంట. మనోళ్ళంతా మిమ్మల్ని నుంచోబెట్టమంటున్నారు. అయ్‌గారు అ– ఊ అంటన్నారు" పొయ్యూదినపుడు పడ్డ బూడిదను దులుపుకుంటూ అని, మజ్జిగ గ్లాసులున్న ట్రే పట్టుకుని ఇంటిముందుకెళ్ళాడు కిట్టప్ప!

కిట్టప్ప మాట వినగానే గుండె ఝల్లుమంది కస్తూరికి. తను– తను.. ప్రెసిడెంటుగా పోటీచేస్తుందా? అంతా తననే నిలబెట్టమంటున్నారా! తనకు తానే కొత్త మనిషిగా మారిపోయినట్లనిపించింది కస్తూరికి. అవును మరి! తనలాగా చదువుకున్న ఆడవాళ్ళు ఎందరున్నారీ ఊళ్ళో! అసలు నాయనమ్మ గోలపెట్టి ఇంటర్‌తో చదువుమాన్పించి ఈ పెళ్ళి చేయించింది కానీ, లేకుంటే తనీపాటికి ఏ డాక్టరో అయివుండేది కాదూ! ఈ ఊళ్ళో ఎవరికి ఇంగ్లీషులో ఏ కాగితం వచ్చినా చదివిపెట్టేది, కూలీలకు వడ్డీలెక్కలు చెప్పేది, చదువుకునే పిల్లలకు బోలెడు జాతీయ గీతాలు నేర్పేది, చుట్టుపక్కల ఆడవాళ్ళకు చిట్కా వైద్యాలు చెప్పేదీ తను కాదూ! అందుకే తన తెలివిని గుర్తించే అందరూ ఈ నిర్ణయానికి వచ్చి వుంటారు. ఆనందం పొంగుకువస్తోంది కస్తూరికి.

పంచాయతీ ప్రెసిడెంటై 'మెంబర్లు ఏం పని చేయాలో శాసిస్తుందా', రోడ్లూ, పాఠశాల భవనాలు, కాలువలూ, వీధిదీపాలు అన్నీ చక్కగా వుండేట్టు చూస్తుందా, కస్తూరి ప్రెసిడెంటైనాక ఊరు బాగుపడిందని అందరిచేతా అనిపించుకుంటుందా? ఒక్కొక్క ఊహ ఉత్సాహాన్ని నింపి ఉద్వేగాన్ని పెంచుతున్నాయి కస్తూరిలో.

ఆలోచించేకొద్దీ ఇంటిముందు ఏం చర్చలు జరుగుతున్నాయో వినాలనే ఆసక్తి పెరగడంతో ముందు గది కిటికీవద్దకు వెళ్ళి నిలబడింది.

రామచంద్రం వర్గం అంతా అరుగుమీద దీర్ఘాలోచనలో వున్నారు. ఊర్లో రామచంద్రానిదీ, ప్రకాశానిదీ ముఖ్యమైన రాజకీయ వర్గాలు. మిగతా రైతులంతా బాంధవ్యాలబట్టో, పొలంగట్ల తగాదాల బట్టో, అభిమానించే ప్రధాన రాజకీయ పార్టీని బట్టో ఏదో ఒక వర్గంతో కలుస్తారు.

'హూ'! అంటూ దీర్ఘమైన నిట్టూర్పు విడిచాడు రామచంద్రం! కాసేపలా నిశ్శబ్దంగా వుండి "ఇంత బతుకూ బతికి ఆడదాని పేరుమీద పోటీచేయమంటారు!" అన్నాడు నిరసన వ్యక్తంచేస్తున్నట్టు.

"నో! పేరుకోలేనో ఆడ ప్రెసిడెంటు! పెత్తనమంతా నీది కాదా ఏంటి! పోనీ మా చెల్లెమ్మ నీ మాట కెదురుచెప్పే మనిషి కూడా కాదు!" కండువా దులిపి భుజాన వేసుకుంటూ అన్నాడు మరో పెద్ద రైతు సీతారామయ్య!

ఇంట్లో తన మాట కెదురుండదనే సంగతి అందరికీ తెలిపినందుకు గర్వంగా చిరునవ్వు నవ్వుకున్నాడు రామచంద్రం.

రామచంద్రాన్నే గమనిస్తున్న సీతారామయ్య లేచి రామచంద్రం ప్రక్కనే కూర్చుంటూ "ఇదిగో రాంచెంద్రం! పెద్దోళ్ళు అంతా మన మంచికే అన్నట్టు, ఇదీ మన మంచికే వచ్చిందయ్యా! నీకు ఎదురులేకుండా వుండేందుకే ఈ రిజర్వేషనొచ్చింది. నువ్వు కస్తూరిని నిలబెట్టాననే అనుకుందాం! మరి ఆ పెకాశం ఎవుర్ని నిలబెడతాడంటావ్!" అన్నాడు క్రాస్ ఎగ్జామిన్ చేస్తున్నట్టు.

"ఇంకెవర్ని! తన పెళ్ళాన్ని" అన్నాడు రామచంద్రం ఇది కూడా తెలియదా అన్నట్టుగా.

ఫెళ్ళున నవ్వాడు సీతారామయ్య! "అదీ! అద్దదీ! అదేనయ్యా మనక్కావల్సింది. ఆడి పెళ్ళాం సంగతి ఊళ్ళో తెలియందెవ్వరికి? కాపరానికొచ్చి ఏడాదిరక్కుండానే అత్తామామల్నుంచి వేరుపడి తల్లీ కొడుకుల్ని కాకుండా చేసిందా? ఇన్ని ఎలచ్చన్లు జరుగుతుండాయి కదా ఊళ్ళో! ఒక్కనాడు– ఒక్కనాడైనా పదిమంది కార్యకర్తలకైనా వండిపెట్టిందా? పెకాశరావు పెళ్ళాం మొగరాయుడని అందరూ అనుకునేదే గందా! అట్టింటి మగరాయుణ్ణి గెలిపిస్తే ఊళ్ళో ఒక్క ఆడది కూడా మొగుడుకు తిన్నగా వండిపెట్టదనే సంగతి ఊళ్ళో మగాళ్ళకి తెలియదా ఏంది! అదే మన కస్తూరమ్మను చూడు! కాపరానికొచ్చింది చిన్నవయసైనా అత్తామామల్ని ఎట్టా చూసుకునేది? ఆడపడుచుల కెన్ని పురుళ్ళు పోసింది? మరుదుల్ని ఎట్టా పెద్దజేసిందీ, రోజూ ఎంతమందికి వండిపెడుతుందీ– ఊళ్ళో తెలియందెవరికీ! కాండేటు పెచ్చింగయ్యా మనకి! ఎనకాల రాజకీయం నడిపించి తిమ్మిని బమ్మిని చేయగల మాటకారి మొగోడిని నువ్వుండనే వుంటివన్న సంగతి జెనానికి మాత్రం తెలియదా" ఉపన్యాస ధోరణిలో రెచ్చిపోయాడు సీతారామయ్య.

"అవునవును. కస్తూరమ్మనే ఖాయంజేయాలి" అన్నారు మిగతావాళ్ళంతా!

రామచంద్రానికి 'కాగల కార్యం గంధర్వులే తీర్చడమంటే ఏమిటో' అర్థమైంది. ఈసారి ఎలాగైనా ప్రెసిడెంట్ అవ్వాలని వుంది అతని మనసులో. అంతలోనే ఆ ఊరి సీటు మహిళా రిజర్వేషన్ కింద వచ్చింది. భార్యను తురుపుముక్కగా వాడి సీటు దక్కించుకోవాలని వున్నా, రామచంద్రం పెళ్ళాన్ని అడ్డుపెట్టుకుని పెత్తనం సాగిస్తున్నాడని అనుకోకుండా వుండేందుకు తనకిష్టం లేనట్టు నటించాడు. పైకి ఏమీ బయటపడకుండా, "సరే మీరంతా అలా అంటుంటే, పార్టీకోసమైనా ఒప్పుకోవాలి కదా నేను" అన్నాడు బెట్టుగా.

సీతారామయ్య చెప్పిన మాటలు విన్న కస్తూరికి ఊహల ఊయల మీదనుంచి ఊబిలోకి జారిపడ్డట్టయింది.

తిమ్మిని బమ్మిని చేయగలగడం, రాజకీయం నడపగలగడం, పెత్తనం చేయగలగడం, మాటకారితనం తన భర్త అర్హతలైతే, నోరెత్తకపోవడం, చాకిరీ బాగా చేయగలగడం, అత్తమామల్ని, ఆడపడుచుల్ని నెత్తిన పెట్టుకుని మోయడం ఇవన్నీ తన అర్హతలు.

ఇవి చేయకపోవడం ప్రకాశం భార్యకు అనర్హతలు. ఈ చాకిరీలో తన జీవితానందాన్నంతా కోల్పోయి, తన జీవిత నిర్ణయాలన్నీ తనే చేసుకోగల ప్రకాశం భార్యలా వుండాలని తనెంత ఆశపడిందీ వీళ్ళకేం తెలుసు? విషాదంగా నవ్వుకుంది కస్తూరి.

శరీరంపై హక్కు పొందినందుకు అతని అవసరాలకు ఉపయోగపడి, అతను కనమన్నంతవరకు పిల్లల్ని కన్నట్టే, రేపు పదవి వచ్చాక, పెట్టమన్న చోటల్లా సంతకం పెట్టి, చెప్పమన్న చోటల్లా అతని మాటలు ఒప్పజెప్పడం తప్ప, ఇంకేవో కొత్త రెక్కలు మొలుస్తాయన్న తన భ్రమకు తనకే నవ్వొచ్చింది కస్తూరికి.

"ఏం? అప్పుడే నిద్రా?" అన్న రామచంద్రం గదమాయింపుకు ఉలిక్కిపడి లేచి గబగబా వంటింట్లోకి నడిచింది. సమావేశం ముగిసినట్టు అరుగంతా ఖాళీగా వుంది.

భోజనం చేస్తున్నప్పుడు తాను తీసుకున్న నిర్ణయం గురించేమైనా చెప్తాడేమోనని ఎదురుచూసింది కస్తూరి. మౌనంగా భోజనం ముగించి కూర్చున్న పీటను విసురుగా వెనక్కు తన్ని నిర్లక్ష్యంగా లేచి వెళుతున్న రామచంద్రాన్ని చూసి నిట్టూరుస్తూ వంటగది సర్దడం ముగించింది.

* * *

మూడురోజుల తర్వాత మరిది శ్రీను నామినేషన్ పత్రాలు తీసుకువచ్చి "వదినా ఈసారి ప్రెసిడెంట్‌గా నీ పేరున నామినేషన్ వేస్తున్నాడట అన్నయ్య. సంతకాలు పెట్టమన్నాడు" అంటూ కాగితాలు చేతికిచ్చాడు. అభ్యర్థిని ప్రతిపాదించేచోట రామచంద్రం సంతకాలు వున్నాయి. నిస్సహాయంగా ఏ అభ్యర్థీ కోరుకోని విధంగా తన ఓటమిని కోరుకుంటూ సంతకాలు చేసి పంపింది కస్తూరి.

భోజనాలయ్యాక, పోస్టర్లకు నమూనా చెప్పి రాయిస్తున్నాడు రామచంద్రం శ్రీనుచేత. ఫలానా గ్రామ పంచాయతీకి పోటీచేస్తున్న అభ్యర్థి కస్తూరి, బ్రాకెట్లో రామచంద్రంగారి భార్య కే మీ ఓటు అని రాసి ప్రింటింగుకి ఇచ్చిరమ్మన్నాడు.

అలా భార్య అని వ్రాయడం బావుండదేమో అని నసిగాడు శ్రీను. "ఎలా బావుండేదీ నాకు తెలుసుగానీ చెప్పినట్లు చేయనోయ్" అని గద్దించి అక్కడే గుమ్మంలో నిలబడి వున్న కస్తూరిని చూసి "ఏమండీ ప్రెసిడెంటుగారూ! తీరిగ్గా నిలబడ్డారేం! పచ్చిమిర్చి కోస్తున్నారు తోటకి వెళ్ళమని ఇందాకనగా చెప్పాను. ఏం? వినబళ్ళేదా!" అన్నాడు వ్యంగ్యంగా.

అతని వ్యంగ్యానికి కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి కస్తూరికి. చెప్పబోయిన మాటను మింగేసి చరచరా తోటకు నడిచి గట్టుమీద కూలబడింది నిస్త్రాణగా.

కూలీలు కబుర్లాడుతూ మిర్చి కోస్తున్నారు. సరిహద్దునే వున్న ప్రకాశరావు తోటలోంచి ముఠామేస్త్రి రాములమ్మ వచ్చి కస్తూరికి దగ్గర్లో చతికిలబడింది.

"అమ్మా! ఈసారి తనరేనటగా ప్రెసిడెంటు!" అంది ఆశగా.

"గెలిస్తే కదా"! అంటూ తలెత్తి రాములమ్మవైపు చూసి, "అరె ఆ దెబ్బలేంటి" అంది గాభరాగా!

"ఏవుందమ్మా! ఎలచ్చన్ల పున్నెమా అని ఊళ్ళో కాపుసారా కావలసినంత దొరుకుతుంటే, ఇక పెకాశరావుగారి పెద్దపాలేరు వీరిగాడికేం తక్కువ, వాడి పెళ్ళానికి దెబ్బలేం తక్కువ?" విరక్తిగా అంది రావులమ్మ.

రాములమ్మ స్వతహాగా తెలివైంది, చురుకైంది. తన ముఠాతో రావులమ్మ కూలికి వచ్చిందంటే, రైతు ఆ పొలంవైపు కూడా చూడక్కర్లేనంత నిశ్చింత. మేస్త్రిగా కూలి కూడా ఆమెకు కొంచెం ఎక్కువే. వాళ్ళ వాడలో అందరికీ తలలో నాలుకలా మెలిగే రాములమ్మంటే అభిమానమే! కాని వీరిగాడికి పెళ్ళాం చురుకుదనం, మంచి పేరూ చూస్తే మంట. తాగివచ్చి ఆమె సంపాదనంతా లాక్కుపోగా, ఏదో వంకతో చావబాదుతుంటాడు. ఈ బాధలు పడలేక మొగుడిని వదిలిపోవడానికి ప్రయత్నించింది రాములమ్మ. కానీ వీరిగాడు ప్రకాశరావుద్వారా కులపెద్దలకు చెప్పించి పిల్లల్ని ఆమెకివ్వకుండా తీర్పు చెప్పించి ఆమెకు బంధాలు వేయించాడు. పాలేళ్ళను గుప్పిట్లో వుంచుకోవడానికి పెద్ద రైతులు కుల పంచాయతీలలో జోక్యం చేసుకోవడం ఆ ఊళ్ళో మామూలే!

'అమ్మా' అన్న పిలుపుతో ఆలోచనల్లోంచి బయటపడింది కస్తూరి.

"అమ్మా! మీరు పెసిడెంటైనాకైనా ఆడోళ్ళ ఆళ్ళ బతుకు ఆళ్ళు బతికే పంచాయతీలు చెప్పండమ్మా. రోజూరోజూ ఈ నరకం మేం పడలేనమ్మా" బావురుమంది రావులమ్మ.

ఏడుపూ, నవ్వూ ఒక్కసారే వచ్చాయి కస్తూరికి. "ప్రెసిడెంటయినా నేను ఒక మగాడి పెళ్ళాన్నే కదా రావులూ! పోనీ నువు ప్రెసిడెంటయితే ఏం చేస్తావో చెప్పు" అంది కస్తూరి ఆసక్తిగా.

"ఏం చేస్తానా? ఆడదాని ఒంటిమీద చెయ్యేసే వాళ్ళనీ, వాళ్ళకు వత్తాసు పలికే పెద్దోళ్ళనీ జైల్లో తోయిస్తా" కసిగా అంది రాములమ్మ!

ఊహల్లో కూడా భర్తనెదిరించే ధైర్యం లేని తను రాములమ్మకేం వాగ్దానం చేయాలో తోచక కస్తూరి మౌనంగా తోటలోకి నడిచింది.

తెల్లవారితే నామినేషన్లకు ఆఖరిరోజు. ప్రకాశరావు తరఫున ఇంతవరకూ ఎవరూ నామినేషన్ వేయలేదు. రామచంద్రం వర్గంలో ఉత్సాహం ఉరకలేస్తోంది. విశ్రాంతిగా అరుగుల మీద కూర్చుని కబుర్లాడుకుంటున్నారంతా!

కిట్టప్ప ఆఘమేఘాలమీద నగరుస్తూ వచ్చాడింతలో. "అయ్యగారూ పెకాశంగారు వీరిగాడి పెళ్ళాంతో నామినేసనేపిత్తన్నాడంట! వాడలో వాళ్ళంతా ఒక్కమాటమీద వుంటాలంటూ తెగ వాగుతున్నాడు" యజమాని శత్రుత్వాన్ని తన శత్రుత్వంగా భావిస్తూ ఉద్వేగంగా కిట్టప్ప చెప్పినమాట బాంబులా పేలిందక్కడ.

ప్రకాశం రాజకీయానికి రామచంద్రం వర్గానికి తల తిరిగిపోయింది. వాడలో ఓట్లు ఇదివరకు చెరిసగం వుండేవి. ఇప్పుడు వాళ్ళ మనిషినే పోటీలోకి దింపితే మెజారిటీ అటే పడడం ఖాయం. వీరిగాడెటూ తన గుప్పెట్లో మనిషి. వాడి భార్య వాడి చెప్పుకింద తేలు. పైగా వాడలో రాములమ్మకు మంచి పేరుంది కాబట్టి ఎక్కువ ఓట్లు పడతాయి. ఊళ్ళో తన వర్గం ఓట్లెలాగూ తనకే పడతాయి.

ఎంతో తేలికనుకున్న ఎన్నిక క్లిష్టంగా మారడంతో మతిపోయింది రామచంద్రానికి. డబ్బుతో వాడను కొనాలంటూ మంతనాలు మొదలెట్టాడు తనవాళ్ళతో!

ఈ వార్త వినగానే నవ్వొచ్చింది కస్తూరికి. తను భర్త చేతిలో పదవిబొమ్మ. మరి రావులమ్మ భర్త యజమాని చేతిలో బొమ్మా? రెండ్రోజుల క్రితం తోటలో రాములమ్మ మాటలు గుర్తొచ్చాయి కస్తూరికి. తన కంటే రాములమ్మే చాలా మెరుగనిపించింది. భర్త ఉక్కుపాదం కిందనుంచి బయటపడేందుకు కనీస ప్రయత్నం చేసింది. అలాంటి రాములమ్మ స్వతంత్ర ఆలోచనకు అధికారం కూడా తోడైతే! 'స్త్రీలకు కల్పించిన ఈ రిజర్వేషన్ లక్ష్యం రాములమ్మ గెలిస్తేనే ఎంతో కొంత సార్థకమవుతుంది తప్ప తనలాంటివాళ్ళు గెలిస్తే కాదు' తనలో తాను తర్కించుకుంటూ గంభీరంగా వుంది కస్తూరి.

రాములమ్మ వేలిముద్ర వేయించిన పత్రాలతో ఊరేగింపుగా వెళ్ళి నామినేషన్ వేయించాడు ప్రకాశం.

చిందులు తొక్కుతున్నాడు రామచంద్రం. వాడపై సామదాన భేదోపాయాలన్నీ ప్రయోగిస్తున్నాడు.

దండోపాయం కూడా ప్రయోగించే ఆలోచనతో పార్టీ జిల్లా కార్యాలయానికి వెళ్ళాడు ఆ రోజు.

సాయంత్రానికల్లా "కస్తూరి స్వయంగా తన నామినేషన్ ఉపసంహరించుకుం"దన్న వార్త గుప్పుమంది ఊర్లో!

మామిడి మొక్కలకు నీరు పెట్టిస్తున్న శ్రీను ఉరుకులు పరుగులమీద పరుగెత్తుకొచ్చాడు ఇంటికి.

తాపీగా పనిచేసుకుంటోంది కస్తూరి. మానసిక ఘర్షణ తీరిపోయి తేటగా వుందామె ముఖం.

"వదినా ఏమిటి నువు చేసిన పని? అంతా నీ ఇష్టమేనా? అన్నయ్య వస్తే ఏం జరుగుతుందో ఆలోచించావా" ఆవేశం, ఆందోళన కలిపి ప్రశ్నించాడు శ్రీను.

"ఎందుకయ్యా అంత ఆవేశం? అంతా నా యిష్టమేనా అన్నావు కదూ! ఇప్పటివరకు నా ఇష్టప్రకారం జరిగిన పని ఇదొక్కటేనయ్యా!

బరిలోకి దిగే వస్తాదుకి స్వయంగా గెలవాలనే కోరికా, దానివల్ల అతనికి కొంత లాభమూ వుంటాయి. దానికి తోడు చుట్టూ వున్నవాళ్ళ ప్రోత్సాహం కొండంత బలాన్నిస్తుంది. దానితో అతడు గెలుపుకోసం ప్రాణాన్నే పణంగా పెట్టి పోరాడతాడు. కానీ చుట్టూ వున్నవాళ్ళ ఉత్సాహమూ, ప్రయోజనం కోసం ఎవరైనా బలవంతాన బరిలోకి తోయబడ్డాడే అనుకో– వాడు బలైపోవడానికి సిద్ధమై పోరాటమైనా చేయాలి, లేదా నవ్వులాటల్ని సహించి కుస్తీ మొదలుకాకముందే చేతులెత్తేయాలి. నేనూ అదే పని చేశానయ్యా! మీ, మీ పరువు పందేలకోసం ఆసక్తిలేని, బలం లేని మల్లయుద్ధం చేయలేను. ఇక మీ అన్నయ్య వచ్చాక జరిగేదంటావా? ఈ ఇంటికి నా చాకిరీ అవసరం ఎంతుందో మీ అన్నయ్యకు తెలిసినంతగా మరెవరికీ తెలియదు. ఒకవేళ ఆయనకు అదక్కర్లేదనుకున్నా నా శ్రమకూ కొంత విలువ వుందనీ, అది నన్ను పోషించగలదనే ధైర్యం నాకుంది"

నిర్భయంగా చెబుతున్న కస్తూరివంక సూటిగా చూడలేక నెమ్మదిగాడు శ్రీను.

"అమ్మగారూ! ప్రకాశంగారు ఊరేగింపుకని కబురు చేస్తే రాములమ్మ రానందట. వాడలోని ఆడవాళ్ళను తీసుకుని మీకు మొక్కేందుకు వస్తుందట."

కిట్టప్ప చెప్పిన మాటలు విన్న కస్తూరి ముఖం విజయ దరహాసంతో వెలిగిపోయింది.